సాక్షి ప్రకాశం

శనివారం । 9 । నవంబర్ । 2024



నిర్లక్ష్య ధోరణి సహించేది లేదు

పేద విద్యార్థుల ఆహారం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. - 8లో..



రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ముందు వెళ్తున్న లారీని వెనక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో దానిపై ప్రయాణిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన తూర్పు నాయుడు పాలెం వద్ద జరిగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

తొలగించిన మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవాలి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



ఒంగోలు సిటీ: ఒంగోలు కార్పొరేషన్‌లో తొలగించిన మేస్త్రీలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో 125 మంది మేస్త్రీలను అర్ధంతరంగా విధుల నుంచి తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. వీరిలో 50 మంది ఆప్కాస్ లో పని చేస్తున్నట్లు తెలిపారు. 75 మంది కరోనా సమయంలో ప్రాణాలు తెగించి ప్రజలకు సేవ చేశారని, అలాంటివారిని తొలగించడం బాధాకరమన్నారు. చాలీచాలని జీతాలతో మున్సిపాలిటీలో పనిచేస్తున్నారన్నారు. విధుల నుంచి తొలగించిన కార్మికుల పోరాటాలకు మద్దతు ఇస్తామన్నారు.


బెల్ట్ షాపులపై దాడులు ఐదుగురు అరెస్టు

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: మార్కాపురం డివిజన్లోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై శుక్రవారం దాడులు నిర్వహించి పలువురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డీ బాలయ్య తెలిపారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. శుక్రవారం 'సాక్షి'లో మామ 'ఏక్ పెగ్ లా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బాలయ్య ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. యర్రగొండపాలెం పరిధిలో రెండు బెల్ట్ షాపులు, మార్కాపురం పరిధిలో ఒకటి, కంభం, గిద్దలూరు ఎక్సైజ్ స్టేషన్లో పరిధిలో రెండు బెల్ట్ షాపులపై దాడులు చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మొత్తం 90 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయా స్టేషన్ల ఎక్సైజ్ అధికారులు దాడులు చేసినట్లు చెప్పారు.



గేటు అమర్చుతున్న దృశ్యం



గుండ్లకమ్మ ప్రాజెక్టు (ఫైల్)

గుండ్లకమ్మ.. భద్రం

జిల్లాలో ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న గుండ్లకమ్మ జలాశయానికి సంబంధించి గత వైఎస్సార్‌సీపీ సర్కార్ ముందు చూపుతో తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. 2014–19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం ఫలితంగా గేట్లు తుప్పుపట్టిపోయాయి. ఫలితంగా రిజర్వాయర్ గేట్లు కొట్టుకుపోయాయి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని శాశ్వత ప్రాదిపదికన మరమ్మతులు చేసేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ. 9.17 కోట్లు మంజూరు చేసింది. అత్యాధునిక సాంకేతిక విధానంలో తయారు చేసిన గేట్ల ఏర్పాటుకు టెండర్లు ఖరారు చేసింది. మొత్తం 15 గేట్లకు 11 గేట్లను అమర్చారు. మిగిలిన వాటిని నెలరోజుల్లో అమర్చనున్నారు. గతంలో అధికారంలో ఉన్న టీడీపీ సర్కార్ ఈ ప్రాజెక్టు సుందరీకరణ పేరుతో నిధులు దిగమింగేసింది.

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవతో కొత్త గేట్ల అమరిక
- గతంలో రిజర్వాయర్‌ను నిర్లక్ష్యం చేసిన బాబు సర్కార్
- బ్యూటిఫికేషన్ పేరుతో అప్పట్లో రూ.6.30 కోట్లు మింగేసిన వైనం
- నిర్వహణ లేకపోవడంతో కొట్టుకుపోయిన గేట్లు
- రూ.9.17 కోట్ల నిధులు విడుదల చేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- గుజరాత్ సంస్థతో 2024 జనవరిలో అగ్రిమెంట్
- నేడు ప్రాజెక్టుకు కొత్త గేట్లు

సాక్షి ప్రతినిధి ఒంగోలు: తాగు, సాగు నీటి కోసం 3,893 టీఎంసీల సామర్థ్యంతో కందుల ఓబుల్ రెడ్డి గుండ్లకమ్మ జలాశయం నిర్మితమైంది. ఖరీఫ్ సీజన్లో 80 వేల ఎకరాలకు, రబీలో 62,368 వేల ఎకరాల్లోని పంటలకు నీరందించేలా రూపకల్పన చేశారు. ఏడు మండలాల్లోని 64 గ్రామాల వాసుల గొంతులు తడిపేలా అనేక పథకాలు నిర్మించారు. జలాశయం కుడి కాలువ 26 కిలో మీటర్ల పొడవు, ఎడమ కాలువ 22 కిలోమీటర్ల పొడవున నీరు పారుతుంటుంది. ప్రాజెక్టుపై ఆధారపడి 3 వేల మందికి పైగా మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. దీనిని 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించి 2008 నాటికి నిర్మాణం పూర్తిచేసి జాతికి అంకితం చేశారు. రైతులకు అండగా నిలిచారు.

టీడీపీ హయాంలో నిర్లక్ష్యం:

2014 తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం ఫలితంగా ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. కనీస నిర్వహణను సైతం గాలికొదిలేసింది. ప్రాజెక్టు చుట్టుపక్కల సుందరీకరణ పేరుతో రూ.6.30 కోట్లు కాంట్రాక్టర్లకు దోచిపెట్టింది. రిజర్వాయర్ ఎగువ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురవడంతో వరద నీరు ఎక్కువగా వచ్చింది. దీంతో 2022 ఆగస్టు 31వ తేదీ మూడో నంబర్ గేటు కొట్టుకుపోయింది. యుద్ధప్రాతిపదికన స్టాప్‌లాగ్ గేట్లను ఏర్పాటుచేసి నీటి వృథాను అరికట్టారు. ఒక టీఎంసీ నీటిని నిల్వచేసి తాగునీటి అవసరాలకు వినియోగించారు. అలాగే గత ఏడాది డిసెంబర్ 6వ తేదీ రెండో గేటు కొట్టుకుపోయింది. వెంటనే స్టాప్‌లాగ్ గేటును అమర్చి నీటి వృథాను అరికట్టారు.

శాశ్వత ప్రాతిపదికన చర్యలు:

ప్రాజెక్టు పరిస్థితిని అప్పటి మంత్రులు అంబటి రాంబాబు, మేరుగు నాగార్జున.. సీఎంగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేలా చర్యలు చేపట్టారు. అందుకు అధికారుల దగ్గర నుంచి ప్రతిపాదనలు తెప్పించుకున్నారు. రూ.9.15 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఈ ఏడాది జనవరి నెలలో గుజరాత్‌కు చెందిన సంస్థతో ఒప్పందాలు జరిగాయి. ఏప్రిల్ నుంచి గేట్ల మరమ్మతులు మొదలుపెట్టారు. పనులు జోరుగా సాగాయి. ఈ క్రమంలో అక్టోబర్ నెలాఖరుకు మొత్తం 15 గేట్లకు గాను 11 కొత్త గేట్లను అమర్చారు. 12వ గేటును ఈ నెలలో, మిగిలిన మరో మూడు గేట్లను నెల రోజుల్లో ఏర్పాటు చేయనున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. పనులు పూర్తయిన వెంటనే రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీటిని నిల్వచేస్తామని వారు చెబుతున్నారు.



ప్రాజెక్టు గేటు బిగిస్తున్న కార్మికులు

ప్రాజెక్టుపై అసత్య ప్రకటనలు..

ఈ ప్రాజెక్టును నిర్మించి దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి అండగా నిలిచారు. 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ప్రాజెక్టు నిర్వహణను గాలికొదిలేసింది. ఫలితంగా ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయే దుస్థితి ఏర్పడింది. దీనిపై తన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు చంద్రబాబు నాయుడు, ఆయన అనుకూల మీడియా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అసత్యాలను ప్రచారం చేశారు. రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా ఎప్పటికప్పుడు నీటిని విడుదలజేస్తూనే వచ్చారు. అలాగే తాగునీటి అవసరాలకు సైతం నీటిని వదిలారు కూడా. ఎన్నికల సమయంలో అప్పటి ప్రభుత్వం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల సైతం అసత్యాలను ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సీఎం హోదాలో వచ్చిన చంద్రబాబు ఈ ప్రాజెక్టుపై అసత్య ప్రకటనలు చేయడం గమనార్హం.

రైతులకు అండగా నిలిచారు..



గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్వాకం వలనే గేట్లు ఊడిపోయాయి. మొదటి నుంచి మెయింటినెన్స్ చేస్తే ఈ పరిస్థితి దాపురించేది కాదు. గేట్లు బాగు చేయడానికి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రూ.9.15 కోట్లు జారీ చేశారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ గేటు ఊడిపోయిన రైతులకు మాత్రం ఆరు తడులకు తాగునీరు అందించారు.

– జవాజీ లక్ష్మీనారాయణ రెడ్డి, గుండ్లాపల్లి, మద్దిపాడు మండలం

రైతుల పక్షపాతి వైఎస్ జగన్



రైతుల పక్షపాతిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, వ్యవసాయమే దండగన్న చంద్రబాబుకు పోలిక ఎక్కడ. రిజర్వాయర్ ఆయకట్టు కింద రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయాన్ని తెలుసుకున్న వెంటనే గేట్ల నిర్మాణం కోసం వెంటనే గేట్లు శాంక్షన్ చేయడం జగన్‌మోహన్ రెడ్డి నైజం, రిజర్వాయర్ విషయం పట్టించుకోకుండా బ్యూటిఫికేషన్ పేరుతో కాంట్రాక్టర్లకు దోచిపెట్టడం చంద్రబాబు నైజం.

– ఇనగంటి వెంకటేశ్వర్ రెడ్డి, మాచవరం, నాగులుప్పలపాడు మండలం

కేంద్ర ప్రభుత్వ నిధులు స్వాహా చేస్తున్నారు

- పెచ్చరిల్లుతున్న టీడీపీ నేతల అరాచకాలు
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులను టీడీపీ నాయకులు స్వాహా చేస్తున్నారని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆరోపించారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన సర్పంచ్‌లను పక్కన పెట్టి ఆయా ప్రాంతాల్లో ఉన్న పచ్చ నాయకులు తమ ఇష్టానుసారంగా చెలాయిస్తున్నారని, పల్లె పండుగ పేరుతో అభివృద్ధి పనులను సర్పంచ్‌లకు సంబంధం లేకుండా తామే గుర్తించి అంచనాలు వేయించుకొని కేంద్ర ప్రభుత్వం నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, దీని వలన రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పూర్తిగా దెబ్బ తింటుందని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదు నెలల కాలంలో రాష్ట్రంలో అత్యాచారాలు, అరాచకాలు, హత్యలు, అక్రమ నిర్బంధాలు, అక్రమంగా కేసులు బనాయించడం, పేకాట క్లబ్బులు, అక్రమ రేషన్ రవాణా లాంటివి పెచ్చరిల్లిపోతున్నాయని ఆరోపించారు. ప్రజలకు ఉపయోగకరంగా ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయకుండా టీడీపీ నాయకులు తమ జేబులు నింపుకోవటానికి అవసరం లేని ప్రాంతాల్లో పనులు చేయిస్తున్నారని అన్నారు. ఈ విషయాలపై కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఏ మాత్రం పట్టించుకోవడంలేదని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అరాచకాలపై మీడియా ద్వారా తమ గళం వినిపించక తప్పడం లేదని ఆయన అన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యే అంటే అంత చులకనగా చూడటం సరైనది కాదని, ప్రజాస్వామ్య బద్ధంగా తాము పోరాడుతామని, అందుకు వెనుకంజవేసే ప్రసక్తే లేదన్నారు. అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం, మట్టి, ఇసుకను ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోకుంటే తామే అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి పాల్గొన్నారు.



క్లుప్తంగా

రెండో శనివారం పనిదినంగా ప్రకటించాలి

● కలెక్టర్‌ను కోరిన ఏపీటీసీఏ ప్రతినిధులు



కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్న ఏపీటీసీఏ ప్రతినిధులు

ఒంగోలు అర్బన్: ఇటీవల తుఫాన్ నేపథ్యంలో నాలుగు పనిదినాలు కోల్పోయామని, అందువలన రెండో శనివారం పనిదినంగా ప్రకటించాలని కోరుతూ ఏపీటీసీఏ ప్రతినిధులు శుక్రవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి విజ్ఞప్తి చేశారు. స్పందించిన కలెక్టర్.. రెండో శనివారాన్ని పనిదినంగా ప్రకటిస్తూ పాఠశాలలు నిర్వహించుకోవచ్చని డీఈఓకు ఆదేశాలు జారీ చేసినట్లు ఏపీటీసీఏ ప్రతినిధులు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాంటిస్సోరి ప్రకాష్, రామిరెడ్డి, బ్రహ్మయ్య, ఆంధ్రా శ్రీనివాస్, ఆర్కిడ్స్ అజయ్, ప్రజ్ఞ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

2,053 విద్యుత్ సర్వీసుల తనిఖీ

ఒంగోలు సిటీ: ఒంగోలు డీఈఈ మాకినేని హరిబాబు ఆధ్వర్యంలో ఒంగోలు డివిజన్‌లో 31 మంది విద్యుత్ సిబ్బంది 2,053 సర్వీసులను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మాల్‌ప్రాక్టీస్ కింద ఒక కేసు నమోదు చేసి రూ.9 వేలు, అడిషనల్ లోడ్‌కు సంబంధించిన 186 సర్వీసులకు రూ.7,41,400 అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీల్లో శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, బి.కోటేశ్వరరావు, టి.శ్రీకాంత్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్బీ డీఎస్పీగా సురేష్‌బాబు

ఒంగోలు టౌన్: స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) డీఎస్పీగా ఎన్.సురేష్‌బాబును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. 1989 బ్యాచ్‌కు చెందిన ఆయన.. గతంలో ఒంగోలు ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా పనిచేశారు.

11న ఆజాద్ జయంతి

ఒంగోలు వన్‌టౌన్: భారత ప్రభుత్వ మొదటి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఈ నెల 11వ తేదీ మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి బి.నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ మైనార్టీల సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఒంగోలు సెయింట్ థెరిస్సా హైస్కూల్ సమీపంలోని ఆజాద్ విగ్రహం వద్ద ప్రారంభించి హైస్కూల్లో నిర్వహించే కార్యక్రమాలలో అందరూ పాల్గొనాలని నారాయణ కోరారు.

15 గ్రానైట్ లారీల పట్టివేత



పట్టుబడిన లారీలు

చీమకుర్తి రూరల్: మైనింగ్ బిల్లులు లేకుండా అక్రమంగా గ్రానైట్ రవాణా చేస్తున్న 15 లారీలను గనుల శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా దాడులు చేసి పట్టుకున్నారు. రామతీర్థం ప్రాంతంలో మైనింగ్ అధికారి ఏజీ రవివర్మ ఆకస్మికంగా దాడులు చేశారు. కంకర లారీలు, గ్రానైట్ బ్లాక్ లారీలను పట్టుకున్నట్లు రవివర్మ తెలిపారు.

11న జాబ్‌మేళా

ఒంగోలు వన్‌టౌన్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కార్యాలయం, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ ఒంగోలు ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి జె.రవితేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ అర్హత కలిగిన 19 నుంచి 30 సంవత్సరాల వయసు యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు పాస్‌కార్డు, ఆధార్‌కార్డు, సర్టిఫికెట్ జెరాక్స్ కాపీలతో రావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.14 వేల నుంచి రూ.25 వేల వరకూ జీతం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ విద్యాసాగర్ (7989244381)ను సంప్రదించాలని సూచించారు.

ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపిక పరీక్ష వాయిదా

ఒంగోలు వన్‌టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ శిక్షణకు ఈ నెల 10న నిర్వహించాల్సిన ఎంపిక పరీక్షను వాయిదా వేస్తున్నట్లు ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.లక్ష్మానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి ఎమ్మెల్సీ ఎన్నిలకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ వలన స్క్రీనింగ్ పరీక్షను వాయిదా వేయమని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.లావణ్య సూచించినట్లు చెప్పారు. ఎంపిక పరీక్షను ఎప్పుడు నిర్వహించేది మళ్లీ ప్రకటిస్తామన్నారు.

గోవు ఘోష పట్టదా..?



గంగదొనకొండ గంగమ్మ గుడిలో లంపి స్కిన్ వ్యాధితో మృతిచెందిన ఆవు (ఫైల్)



రోడ్లపై పడుకుని ఉన్న ఆవులు

● వ్యాధులకు బలైపోతున్న ఆవులు, ఎద్దులు
● తెల్ల జాతి పశువులను నిర్లక్ష్యంగా వదిలేసిన పశువైద్యులు
● కురిచేడు మండలంలో విజృంభిస్తున్న లంపి స్కిన్ వ్యాధి
● చోద్యం చూస్తున్న పశువైద్యాధికారులు, ప్రభుత్వం

దర్శి:

హిందూధర్మంలో గోవుకు ఉన్న ప్రాధాన్యత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. హిందువులు పూజించడంతో పాటు మానవుని ఆరోగ్యానికి సైతం అమృతంలా ఆవు ఉపకరిస్తుంది. ఆవు నుంచి వచ్చే పాలు, వాటితో తయారయ్యే పెరుగు, మజ్జిగ, నెయ్యి, చివరకు ఆవు పేడ, మూత్రంతో సహా అన్నీ మానవుని ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. క్యాన్సర్ లాంటి వ్యాధులను సైతం నయం చేసే ఔషధ గుణాలు ఆవులో ఉన్నాయి. అలాంటి ఆవులకు వైద్యం చేయకుండా పశువైద్యులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వాటికి కావాల్సిన మందులు, దాణా సరఫరా చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గోవుల మరణాలకు కారణమవుతోంది.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పశువైద్యాధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ పశువైద్యశాలల్లో వైద్య సేవలు అందక పశువులు రోగాల బారిన పడి మృతిచెందుతున్నాయి. గ్రామాల్లో డబ్బున్న రైతులు తమ పశువులకు ఏవైనా వ్యాధులు సంక్రమిస్తే ప్రైవేటు వైద్యం చేయించుకుని నయం చేసుకుంటున్నారు. కానీ, పాడిపైనే ఆధారపడి జీవించే పేద రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వ వైద్యం అందక అంతుచిక్కని రోగాలతో తమ పశువులను బలిచేసుకునే పరిస్థితి దాపురించింది. వర్షాకాలం వస్తే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నప్పటికీ ముందు జాగ్రత్త చర్యలుగా టీకాలు వేసి నివారించే విధానానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. కింది స్థాయి సిబ్బంది పశువులకు టీకాలు వేయకుండానే ఆన్‌లైన్‌లో వేసినట్లు నమోదు చేసి ఉన్నతాధికారుల మెప్పు పొందుతున్నారు. ఉన్నతాధికారులేమో కార్యాలయాలకే పరిమితమై క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండానే ఆన్‌లైన్ డేటా చూపించి కాకి లెక్కలతో కాలయాపన చేస్తున్నారు. దీంతో మూగ జీవాలకు రకరకాల రోగాలు వచ్చి నయం కాక మృత్యువాతపడుతున్నాయి. వాటిపై గ్రామాల్లో అవగాహన కల్పించి సరైన వైద్యం అందించే వారు లేకుండా పోయారు.

తెల్లజాతి పశువుల పర్యవేక్షణ గాలికి...

జిల్లాలో తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్లు సుమారు 56,820 ఉన్నాయి. వీటిని పర్యవేక్షించి వైద్యం చేయడాన్ని కూటమి ప్రభుత్వం వచ్చాక పశువైద్యాధికారులు పూర్తిగా గాలికొదిలేశారు. దర్శి నియోజకవర్గంలో వీటి పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకు జిల్లాలో పశువుల ఆస్పత్రులకు మందులు అందిన దాఖలాలు లేవు. గత ప్రభుత్వంలో ఉన్న మందులే సర్దివాడుతున్నారు. కురిచేడు మండలంలోని గంగదొనకొండ, పొట్లపాడు గ్రామాల్లోని ఆవులకు ప్రభుత్వ వైద్యం అందక ప్రైవేటు వైద్యం చేయించినా ఫలితం లేకుండా పోయింది. కొన్ని ఆవులు ఇప్పటికే మృతి చెందాయి. మరికొన్ని ఆవులకు గోట్‌ఫాక్స్ వ్యాక్సిన్ కూడా వేయకపోవడంతో ఆ వ్యాధిబారినపడి కొట్టుమిట్టాడుతున్నాయి. జిల్లాలో లంపి స్కిన్‌తో నిత్యం ఎక్కడో ఒక చోట ఆవులు, ఎద్లు మరణిస్తున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

దేవాలయాలకు ఇచ్చే ఆవులకు దిక్కేది...

ఆవులు, ఎద్లను అధికంగా దేవాలయాలకు ఇచ్చి గ్రామాల్లో వదిలేసి ఉన్నారు. వీటితో పాటు మందలు మందలుగా వలస ఆవులు ఉంటాయి. ఇలా గ్రామ పంచాయతీ, నగర పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో ఉండే ఆవుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వాటి ఆలనాపాలనా చూసే వారే కరువయ్యారు. మొక్కుబడులు మొక్కుకుని ఆవులను దేవాలయాలకు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారేగానీ.. ఆ తర్వాత వాటి పర్యవేక్షణ గురించి ఏ ఒక్కరూ పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. దీంతో వాటికి తిండి లేక చెత్తకుప్పల్లో చెత్తాచెదారం, కవర్లు తినాల్సిన దుస్థితి నెలకొంది. కూరగాయల కొట్ల వద్ద కుళ్లిన కూరగాయలు, పండ్లు, రోడ్లు పక్కన పడేసిన ఆహార వ్యర్థాలు, తినకూడని పదార్థాలు తిని రోగాల బారిన పడుతున్నాయి. ఇలా జిల్లాలో రోగాల బారిన పడి చనిపోయిన ఆవులు, ఎద్లు కోకొల్లలుగా ఉన్నాయి.

దండంపెడతారేగానీ.. అన్నం పెట్టరు..!

ఆవు కనిపిస్తే హిందువులు లక్ష్మీదేవిగా భావించి తమకు ఆర్థికంగా బాగా కలిసిరావాలని కోరుకుని పసుపు, కుంకుమ బొట్లు పెట్టి పూజించి దండం పెడతారు. కానీ, వాటికి ఆహారం మాత్రం పెట్టరు. సరైన ఆహారం లేకుండా అవి ఎలా బతుకుతున్నాయి.. వాటి ఆలనాపాలనా ఎవరు చూస్తున్నారని ఆలోచించే వారే కరువయ్యారు.

ఆవులకు నివాసాలేవి..?

ఆలయాల్లో పూజిస్తూ ఉండాల్సిన ఆవులు రోడ్లపై ఆహారం కోసం తిరుగుతున్నాయి. కొన్ని ఆవులు రాత్రి పూట ఎక్కడ ఉండాలో తెలియక రోడ్లపైనే పడుకోవడం, వాహనాల రాకపోకల సమయంలో ప్రమాదాలకు గురికావడం జరుగుతోంది. కొన్ని ఆవులు రోగాల బారిన పడి పట్టించుకునే వారు లేక జీవచ్ఛవంలా బతికినన్నాళ్లు పోరాటం చేస్తున్నాయి. ప్రభుత్వం ఆవులపై ప్రత్యేక దృష్టి సారించి ఇబ్బందులు లేకుండా దొడ్లు ఏర్పాటు చేస్తే రోగాల బారిన పడకుండా ఉండటమే కాకుండా ప్రమాదాలకు గురికాకుండా ఉంటాయి.

ఆవులను చంపేస్తున్న లంపి స్కిన్...



కురిచేడులో లంపి స్కిన్ వ్యాధితో రోడ్లపై తిరుగుతున్న ఎద్దు

లంపి స్కిన్ అనే ముద్ద చర్మపు వ్యాధితో ఇటీవల ఆవులు అవస్థ పడుతున్నాయి. కాప్రిఫాక్స్ అనే వైరస్ వలన ఎద్లు, ఆవులు వంటి తెల్ల పశువులకు ఈ వ్యాధి సంక్రమిస్తోంది. ఒక రకమైన దోమలు, ఈగలు, పేల వంటి రక్తాన్ని తాగే కీటకాల వలన ఈ వ్యాధి వస్తుంది. చర్మంపై బుడిపెలు వచ్చి అవి శరీరమంతా వ్యాపించి చివరకు వాటి మరణానికి దారితీస్తాయి. ఒక పశువు నుంచి మరో పశువుకు ఈ వ్యాధి సోకుతోంది. ఈ వ్యాధిని గుర్తించి పక్క పశువులకు సోకకముందే టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన పశువులను ప్రత్యేకమైన షెడ్లలో ఉంచి ఇతర పశువులను కలవకుండా చికిత్స చేయించాలి. లేని పక్షంలో ఇతర పశువులకు కూడా ఈ వ్యాధి సోకుతోంది. వ్యాధి సోకిన వెంటనే గుర్తిస్తేనే వాటిని కాపాడటం సాధ్యమవుతోంది. వ్యాధి సోకిన పశువు నోరు, కంటి నుంచి కారే స్రావాలలో వైరస్ ఎక్కువ మోతాదులో ఉంటోంది. ఈ స్రవాలు పశువుల మేత, నీటి తొట్లలోని నీటిలో చేరి వైరస్‌తో కలుషితం చేస్తాయి. ఈ వ్యాధి సోకిన ఆంబోతు వీర్యంలో కూడా వైరస్ విసర్జించబడుతుంది. పాలు తాగే దూడలకు కూడా వ్యాధి వచ్చే ప్రమాదం ఉంది. ఈ ప్రమాదం నుంచి ఆవులు, ఎద్లను కాపాడాలంటే పశుపోషకుల్లో, ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. రోడ్లపై తిరిగే ఆవుల ఆలనా పాలనా పట్టించుకుని మెరుగైన వైద్యం కూడా అందిస్తేనే గోమాతల ఘోష తీరి వాటిని రక్షించుకోగలం.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



నూతన ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నాయకులు

● నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ
● హాజరైన వైఎస్సార్ సీపీ ప్రకాశం, బాపట్ల జిల్లాల అధ్యక్షులు బూచేపల్లి, మేరుగు, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ



విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

చీమకుర్తి: వేదపండితులు, భక్తుల చేతుల మీదుగా మండలంలోని గరికమిట్ట సీతారామాంజనేయస్వామి ఆలయంలో విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత ఆలయంలో వేదపండితుల సమక్షంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించి వేదమంత్రాల నడుమ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం ధ్వజస్తంభం ప్రతిష్ఠ నిర్వహించారు. భక్తులందరికీ అన్నసంతర్పణ చేశారు. అద్దంకి వైఎస్సార్ సీపీ పరిశీలకుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి, వారి కుటుంబ సభ్యులతో పాటు ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరై స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నిర్లక్ష్య ధోరణి సహించేది లేదు

● రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి

సంతనూతలపాడు: పేద విద్యార్థుల ఆహారం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, అంగన్‌వాడీ సెంటర్లను ఉదయం 11 గంటలకి ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ గురించి అడిగి తయారు చేసే విధానం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు వి.పార్వతి శాంతిని విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం తినే వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంతనూతలపాడులోని ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థులకు పోర్టిఫైడ్ రైస్ ప్రాముఖ్యత గురించి వివరించారు. పాఠశాల పరిసరాలు, భోజన వివరాలు పూర్తిస్థాయిలో పరిశీలించి పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో ఉద్యోగులు అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అయన వెంట జిల్లా సివిల్ సప్లైయ్ అధికారి పద్మశ్రీ,, బీసీ వెల్ఫేర్ ఏడీ నాయక్, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ నాగలక్ష్మి, సీడీపీఓ ఇవాంజలి, మండల విద్యాధికారి డి.వెంకా రెడ్డి, ఏపీ రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయురాలు ఎం.ప్రమోద, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన ఫుడ్ కమిషనర్

చీమకుర్తి: రాష్ట్ర ఫుడ్ కమిషనర్ సీహెచ్ విజయ ప్రతాప్‌రెడ్డి శుక్రవారం చీమకుర్తిలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ శివాజీ, పాఠశాల ప్రిన్సిపాల్, వార్డెన్ పాల్గొన్నారు.

ఇరిగేషన్ చెరువుల ఆధునికీకరణకు సమగ్ర నివేదిక

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఉన్న మేజర్, మైనర్ ఇరిగేషన్ చెరువుల ఆధునికీకరణ పనులకు సంబంధించి ఎస్టిమేషన్స్‌తో పాటు సమగ్ర నివేదిక రూపొందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనంలో ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. దీనిలో జిల్లాలోని సాగునీటి చెరువులు, కాలువల ఆధునికీకరణ పనులపై సమీక్షించారు. జిల్లాలో చేపట్టి చెరువులు, కాలువలు ఆధునికీకరణ పనులు సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా మేజర్, మైనర్ ఇరిగేషన్ చెరువుల ఆధునికీకరణపై నివేదిక అందజేయాలన్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో బీఎల్‌ఓలు

● నేడు, రేపు ప్రత్యేక ప్రచార రోజులు ● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలోని అన్నీ పోలింగ్ కేంద్రాల పరిధిలో శని, ఆదివారాల్లో ప్రత్యేక ప్రచార రోజులు నిర్వహిస్తున్నామని అన్నీ పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఈ నెల 23, 24వ తేదీల్లో కూడా నిర్వహిస్తారన్నారు. ఈ ప్రత్యేక ప్రచార రోజుల్లో బూత్ లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ముసాయిదా ఓటర్ల జాబితా, ఫారం-6, 7, 8లతో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఓటర్లు ఓటర్ల జాబితాను పరిశీలించుకోవచ్చని తెలిపారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఒంగోలు క్రీడాకారిణి



జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన దండు ఆశశ్రీ

ఒంగోలు: జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఒంగోలుకు చెందిన దండు ఆశశ్రీ ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ (అండర్ 13) పోటీల్లో సింగిల్స్, డబుల్స్ విభాగంలో ఆశశ్రీ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆమెను స్థానిక లార్డ్ కృష్ణబ్యాడ్మింటన్ అకాడమీలో జరిగిన అభినందన సభలో ఏపీ బ్యాడ్మింటన్ అకాడమీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంశీధర్ మాట్లాడుతూ ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు దండు ఆశశ్రీ ఎంపికవడం అభినందనీయం అన్నారు. జాతీయ స్థాయిలోను రాణించి అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం ఉపాధ్యక్షులు సంజీవ రెడ్డి, శేషిరెడ్డి, కోచ్ అమ్మన్ గౌడ్, లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ అధ్యక్షుడు అద్దంకి మురళీకృష్ణ, సీనియర్ ప్లేయర్ శ్రీను తదితరులు అభినందించారు.

జాయింట్ కలెక్టర్ కోర్టును బహిష్కరిస్తున్నాం



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

ఒంగోలు అర్బన్: జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ నిర్వహించే కోర్టును బహిష్కరిస్తున్నామని, ఆ మేరకు కేసులను కలెక్టరే నిర్వహించాలని కోరుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను ప్రకాశం భవనంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం న్యాయవాదులు మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ కోర్టు జరిగే సమయంలో న్యాయవాదులతో సక్రమంగా వ్యవహరించడంలేదని, అవమానకరంగా మాట్లాడటం దురుసుగా ప్రవర్తించడం చేస్తున్నారని తెలిపారు. అందుకు నిరసనగా శుక్రవారం విధులు బహిష్కరించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు న్యాయవాదులు తెలిపారు. జాయింట్ కలెక్టర్ నిర్వహించే కోర్టుకు సంబంధించిన కేసులను కలెక్టరే నిర్వహించాలని కోరామన్నారు. ముందుగా స్థానిక జిల్లా కోర్టు నుంచి ప్రకాశం భవనం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌దాస్, న్యాయవాదులు ఆలపాటి వివేకానంద, కరవది రాఘవరావు, పాదర్తి ఆదిశేషు, సామంతపూడి శ్రీనివాసరావు, సురేంద్రబాబు, శ్రీనివాసగుప్తా, కె.నాగేశ్వరరావు, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఒకరు మృతి

టంగుటూరు: కారు బోల్తా కొట్టడంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన సూరారెడ్డి పాలెం సమీపంలో నెల్లూరు వైపు వెళ్లే హైవేలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. విజయవాడ నుంచి దైవదర్శనం కోసం ఆరుగురు కుటుంబ సభ్యులు కారులో తిరుపతి బయలు దేరారు. మార్గమధ్యంలో సూరారెడ్డి పాలెం వద్ద రోడ్డుపై చనిపోయి ఉన్న గేదెను.. కారు డ్రైవర్ గమనించకుండా ఢీకొట్టాడు. దీంతో కారు బోల్తా పడగా.. అందులో ఉన్న ఓర్సు పార్వతి (65) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మిగతా ఐదుగురు క్షేమంగా బయటపడ్డారు. జాతీయ రహదారి పోలీసులు సహాయ చర్యలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతుడు వెంకటేశ్వర్లు (ఫైల్)



సంఘటన స్థలంలో వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, స్థానికులు

టంగుటూరు: ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొని దానిపై ప్రయాణిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెంలో భారత్ పెట్రోల్ బంక్ వద్ద గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టంగుటూరు మండలం కాకుటూరివారిపాలెం గ్రామానికి చెందిన కండి వెంకటేశ్వర్లు (40) జాతీయ రహదారిపై ఒంగోలు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ముందు వెళ్తున్న లారీని ఆ డ్రైవర్ తూర్పునాయుడుపాలెం సమీపంలో మలవిసర్జన కోసం ఆపుతుండగా ద్విచక్రవాహనదారుడు వీడియో కాల్ మాట్లాడుతూ లారీని వెనుక వైపు ఢీకొట్టాడు. తీవ్రగాయాలై అక్కడికక్కడే వెంకటేశ్వర్లు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపారు.

లారీ పైనుంచి కిందపడి క్లీనర్ మృతి



మృతిచెందిన జమాల్‌బాషా



సంఘటన స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

కంభం: ప్రమాదవశాత్తూ లారీ పైనుంచి కిందపడి క్లీనర్ మృతి చెందిన సంఘటన స్థానిక కందులాపురం కూడలిలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. మైదుకూరు నుంచి ఉల్లిపాయల లోడుతో బయలుదేరిన లారీని వర్షం పడుతుండటంతో కంభంలో అనంతపురం-అమరావతి హైవేలో ఓవైపు ఆపుకుని పట్టకట్టేందుకు డ్రైవర్, క్లీనర్ పైకి ఎక్కారు. పట్ట కట్టే క్రమంలో క్లీనర్ షేక్ జమాల్ బాషా (47) అదుపుతప్పి లారీ పైనుంచి కింద పడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కంభం ఎస్సై బి.నరసింహారావు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మైదుకూరు నుంచి కంభం వచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్



DISTANCE EDUCATION

■ ANU దూర విద్యా కేంద్రం నిర్వహిస్తున్న MBA/MCA కోర్సులకు ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ దరఖాస్తులకు 7/11/2024 చివరి తేదీ తత్కాల్ పద్ధతిలో 9/11/2024 మధ్యాహ్నం2గం॥ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు ప్రవేశ పరీక్ష 9/11/2024న 2గం॥7 నుండి 4.30 గం॥ వరకు స్థానిక గీతం డిగ్రీ కాలేజి నందు జరుగును. పూ॥వి॥సం॥ ✆ 9849124970 [OA-332]



LAND FOR SALE

■ ప్రకాశం జిల్లా పొదిలి పెద్దారికట్ల (V) ఆనుకుని రోడ్డుకు 2వ బిట్, 2 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మబడును. Opp: సాండిల్ వెంచర్ కలదు. డైరెక్ట్ ఓనర్ స్పా. రిజి. క్లి. టైటిల్. Ph: 8121957116, 6281739335 [SCA24000584]



■ షా శానిటరి వేర్, కర్నూల్‌రోడ్, ఒంగోలు నందు పనిచేయుటకు సేల్స్ పర్సన్స్ (Male) కావలెను. జీతం:15వేలు, Age: 20-30y. సంప్ర॥ ✆ 98491 96808 [OA-333]

■ SBI Life నందు పనిచేయుటకు అడ్వైజర్స్ కావలెను. Qul: 10th ఆపైన Age: 18 to 60 వివరాలకు సంప్ర॥ ✆ 94935 41690, 94410 01062. [O-793927]

■ ప్రముఖ టోల్‌ప్లాజా నందు పనికి 10th - PG అర్హతగల కంప్యూటర్ ఆపరేటర్ &క్యాషియర్ కావలెను. 8 గం॥ డ్యూటీ. భోజనం + వసతి. ఆకర్షణీయ జీతం. Loc: ఒంగోలు. 86397 67040. [NA-3014]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1253910]

■ శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ18k Ph: 9912011899, 9912011499 [SCA-24000548]

■ ప్రముఖ కంపెనీ అగ్రి, ప్రాపర్టీ, బిజినెస్ కొరకు ఏజెంట్స్ DMA, DSA కావలెను. మంచి జీతం & కమీషన్ : 9518675529 [SCA24000598]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

ఆధార్ క్యాంపును పరిశీలించిన జెడ్పీ సీఈవో

సంతనూతలపాడు: సంతనూతలపాడులోని ఒకటో సచివాలయంలో జరుగుతున్న ఆధార్ స్పెషల్ క్యాంపును శుక్రవారం జిల్లా పరిషత్ సీఈవో బి.చిరంజీవి పరిశీలించారు. ఆధార్ క్యాంపు నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు, సంతనూతలపాడు ఇన్‌చార్జి కార్యదర్శి ఎస్.ప్రతాప్ కుమార్, డిజిటల్ అసిస్టెంట్, ఆధార్ క్యాంప్ ప్రతినిధి నాగార్జునరెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు మైనంపాడు విద్యార్థులు

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు డీవీఎల్ నరసింహారావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఎంపికల్లో అండర్-14 బాలికల విభాగంలో లోహిత, అమృత, యశస్విని, బాలుర విభాగంలో అశోక్, నరేంద్ర, అశోక్ సింహ, అబ్దుల్ సలీం, శ్రావణ సాయి, ప్రవీణ్ కుమార్ ఎంపికైనట్లు పీఈటీ తిరుమలశెట్టి రవికుమార్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 9, 10 తేదీల్లో అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో డైట్ కాలేజీ లెక్చరర్ ఆర్.శ్రీనివాసరావు, టీచర్ ఓబుల్ మల్లికార్జునరావు, జ్ఞానేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీమకుర్తి రూరల్: మండలంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ చీమకుర్తి, పల్లామల్లి పరిధిలో విద్యుత్ లైన్లకు మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నాయుడుపాలెం, బండ్లమూడి మంచికలపాడు, తొర్రగుడిపాడు, ఎర్రగుడిపాడు, పాటిమీద పాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఈతముక్కల వాసికి అత్యున్నత గౌరవం



రామచంద్రారెడ్డికి అభినందనలు తెలుపుతున్న బిషప్


ఒంగోలు సిటీ: జిల్లాలోని ఈతముక్కల గ్రామానికి చెందిన డాక్టరు బద్దెల రామచంద్రారెడ్డికి అత్యున్నత గౌరవం దక్కింది. కేరళలోని కాలికట్‌లో జరుగుతున్న 43వ దక్షిణభారత చరిత్ర సంఘ సమావేశాలకు రామచంద్రారెడ్డి జనరల్ ప్రెసిడెంట్‌గా ఎంపికై అధ్యక్షునిగా వ్యవహరించారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు ఈ సమావేశాలు జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన రామచంద్రారెడ్డికి ఈ గౌరవం లభించడం పట్ల ప్రముఖ చరిత్రకారుడు డాక్టరు కొండా శ్రీనివాసులు, ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీకి చెందిన ఆచార్యులు డాక్టరు డి.వెంకటేశ్వరరెడ్డి, ప్రొఫెసర్ జి.రామ్మోహనరావు, ప్రొఫెసర్ జి.సోమశేఖర ప్రత్యేక అభినందనలు తెలిపారు.

12న కృత్రిమ కాళ్లు ఇచ్చేందుకు గుర్తింపు శిబిరం

ఒంగోలు వన్‌టౌన్: జిల్లాలోని దివ్యాంగులకు కృత్రిమ కాళ్ల ఏర్పాటు కోసం గుర్తింపు శిబిరాన్ని ఈ నెల 12వ తేదీ నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు జీ అర్చన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృత్రిమ అవయవాలు అవసరమైన వారు ప్రకాశం భవన్‌లోని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆధార్ కార్డు, సదరం వైద్య ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంప్రదించాలన్నారు.



అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన విశ్రాంతి భవనం



అసంపూర్తిగా నిర్మించిన విశ్రాంతి భవనం



విశ్రాంతి భవనం లేకపోవడంతో రోడ్డు పక్కనే ఆపిన వాహనాలు

- 216 జాతీయ రహదారిపై విశ్రాంతి గదుల నిర్వహణలో కాంట్రాక్టర్ విఫలం
- రోజుకు లక్షల్లో ఆదాయం వస్తున్నా డ్రైవర్లకు తప్పని తిప్పలు
- విశ్రాంతి కావాలంటే రోడ్డు పక్కన ఆగాల్సిందే
- త్రోవగుంట నుంచి దిగమర్రు వరకు ఇదే పరిస్థితి
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా చదలవాడ విశ్రాంతి గదులు

ఆదాయం ఫుల్.. నిర్వహణ నిల్..!

నాగులుప్పలపాడు: జిల్లాలో ప్రాధాన్యం ఉన్న రహదారుల్లో ఒంగోలు-దిగమర్రు రహదారి ఒకటి. కోస్తా తీరం వెంట పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి చెందాలంటే ఈ రహదారి అత్యంత కీలకం. చెన్నై-కోల్‌కతాను కలిపే 16వ నంబర్ జాతీయ రహదారికి ఇది ప్రత్యామ్నాయంగా ఉంది. ఇంతటి గుర్తింపు ఉన్న రహదారి నిర్వహణ అత్యంత అధ్వానంగా ఉంది. నాలుగేళ్ల క్రితం 216 జాతీయ రహదారిగా ఈ రోడ్డును అభివృద్ధి చేశారు. నిర్వహణ ఖర్చును కూడా వాహనాల నుంచి వసూలు చేసేందుకు ఉప్పుగుండూరు-చినగంజాం గ్రామాల మధ్య టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. ఈ టోల్‌గేట్ నుంచి నిత్యం రెండు వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీని ద్వారా ప్రతిరోజూ సుమారు రూ.4 లక్షల వరకు ఆదాయం వస్తోంది. అంటే.. నెలకు రూ.1.2 కోట్ల ఆదాయం వస్తుండగా, రహదారి నిర్వహణ చూడాల్సిన టోల్‌గేట్ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వాహనదారుల రక్తం పిండుతూనే ప్రమాదాల నివారణకు మాత్రం ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు. ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా పట్టనట్లు వ్యవహరిస్తూ వసూళ్లలో నిమగ్నమయ్యారు.

నిర్లక్ష్యానికి సాక్ష్యాలు మచ్చుకు కొన్ని...

చదలవాడ వద్ద రెస్టు రూంలు నిర్మించారు. అయితే



ఉప్పుగుండూరు-చినగంజాం మధ్య ఉన్న టోల్ ప్లాజా



చదలవాడ వద్ద నిరుపయోగంగా ఉన్న విశ్రాంతి భవనం

కనీసం ఒక్కరోజు కూడా వినియోగించుకున్న దాఖలాలు లేవు. ఆ రెస్టు రూంలు మందుబాబులకు అడ్డాగా మారాయి. నిత్యం రాత్రి వేళలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి వెంట పలుచోట్ల రోడ్డు నెర్రెలిచ్చింది. ఈ పగుళ్లలో వాహనాల టైర్లు పడి పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇక గాయపడిన వారి సంగతైతే లెక్కే లేదు. రహదారిపై రాత్రి వేళలో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా లైట్లు వెలగాల్సి ఉంది. అయితే, మూడేళ్లుగా ఒక్క లైటు కూడా వెలిగిన పాపాన పోలేదు. టోల్‌గేట్ పరిధిలో అత్యవసర సహాయ కేంద్రం మచ్చుకు కూడా లేదు. కనీసం హైవే అంబులెన్స్ కూడా ఏర్పాటు చేయలేదు. రోడ్డుపై ఎవరైనా రాత్రివేళ కిందపడితే రక్త మోడుతూనే ఒంగోలు వెళ్లాల్సిన దుస్థితి. ఇక, నేరాలకు ఈ రహదారి అడ్డాగా మారింది. నిత్యం బియ్యం, ఇతర దందాలు చేసే వారు గ్యాంగ్‌లను మెయింటైన్ చేస్తూ రహదారిపై అర్ధరాత్రి వేళలో అరాచకాలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. దీనిపై నిఘా పెట్టేందుకు కనీసం ఈ రహదారిపై సీసీ కెమెరాలు కూడా లేవంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. రహదారికి ఇరువైపులా చిల్లచెట్లు విపరీతంగా పెరిగాయి. మార్జిన్‌ను కూడా ఎప్పుడో కమ్మేశాయి. ఇక సిమెంట్ రహదారిని కూడా ఇరువైపులా మూడు అడుగుల మేర ఆక్రమించాయి. దీంతో ప్రమాదాల తీవ్రత పెరిగింది.

సబ్ కాంట్రాక్టర్‌దే వసూళ్ల పర్వం...

ఈ రోడ్డు నిర్మించింది ఢిల్లీకి చెందిన ఓ ప్రధాన కాంట్రాక్టర్ కాగా, ఇక్కడ మాత్రం మరో సబ్ కాంట్రాక్టర్ టోల్ వసూలు చేస్తుంటారు. ప్రతి నెలా ఇక్కడ ముక్కు పిండి టోల్ వసూలు చేసుకుని కొంత తాను మిగిలించుకుని మరికొంత పైవారికి ముట్టజెబుతారు.

అసంపూర్తిగానే విశ్రాంతి గదులు



నెల్లూరు నుంచి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంకు నెలలో 20 రోజుల పాటు తిరుగుతుంటా. రొయ్య పిల్లల సీడ్ తరలిస్తుంటా. ఈ క్రమంలో ఈ రహదారిపై నిరంతరం ప్రయాణిస్తుంటా. ఎక్కడా విశ్రాంతి గదులు లేవు. చదలవాడ వద్ద నిర్మించినవి కూడా అసంపూర్తిగా ఉన్నాయి. వాడుకలో లేవు. వాహనాలను రోడ్డు పక్కనే ఆపుకుని నిద్రపోవాల్సి వస్తోంది. ఇది ప్రమాదకరమని తెలిసినా తప్పడం లేదు.

– మల్లికార్జునరావు డ్రైవర్, నెల్లూరు

టోల్ గేట్ డబ్బుతో రోడ్డు నిర్వహణ చేపట్టాలి



నిరంతరం ఈ దారిలో లారీ నడుపుతుంటా. ఎక్కడా కూడా డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవడానికి భవనాలు లేవు. నిర్మాణం చేపట్టిన వాటిని కూడా పూర్తి చేయలేదు. భవనాలు పూర్తిచేసి వాటిలో వసతులు కల్పిస్తేనే ఉపయోగం ఉంటుంది. టోల్ గేట్ ద్వారా వసూలు చేసిన డబ్బును రోడ్డు నిర్వహణకు వినియోగిస్తేనే ప్రయాణికులకు ఉపయోగం ఉంటుంది.

– శ్రీను, లారీ డ్రైవర్, ఏలూరు

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన మాజీ మంత్రి మేరుగు



బూచేపల్లి వెంకాయమ్మతో మాట్లాడుతున్న మేరుగు నాగార్జున

చీమకుర్తి: జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను శుక్రవారం చీమకుర్తిలోని ఆమె నివాసంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున మర్యాదపూర్వకంగా కలిశారు. చీమకుర్తిలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బూచేపల్లి వెంకాయమ్మ ఇంటికెళ్లి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దొడ్డవరం పంచాయతీలో డీఎల్‌పీఓ విచారణ

మద్దిపాడు: గత కొద్ది నెలల నుంచి మండలంలోని దొడ్డవరం పంచాయతీలో ఫిర్యాదులు, విచారణ, పంచాయతీ కార్యదర్శి సస్పెండ్, గ్రామ సర్పంచ్ చెక్ పవర్ తాత్కాలికంగా నిలిపివేత, జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు, ప్రజాప్రతినిధుల ఫిర్యాదులు తదితర అంశాలతో వాతావరణం వేడెక్కింది. కొన్ని రోజుల కిందట దొడ్డవరం సర్పంచ్ పూనూరి సుబ్బారావు మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు అందించిన అర్జీపై ఒంగోలు డివిజనల్ పంచాయతీ అధికారిణి ఆర్.పద్మ శుక్రవారం దొడ్డవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఈ విచారణకు మద్దిపాడు మండల విస్తరణ అధికారి కొండపి రఘుబాబు, గ్రామ సర్పంచ్ పూనూరి సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు ఎం.సుభాషిణి, గత పంచాయతీ కార్యదర్శి షేక్ లతీఫ్ హాజరయ్యారు. విచారణలో భాగంగా దొడ్డవరం సర్పంచ్ సుబ్బారావు ఆరోపణలపై మండల విస్తరణ అధికారి రఘుబాబు రాతపూర్వకంగా సంజాయిషీ సమర్పించారు. గతంలో తానూ సదరు ఆరోపణలపై జూలై 31న రిజిస్టర్ పోస్ట్ ద్వారా జిల్లా పంచాయతీ అధికారికి రాత పూర్వక వివరణ ఇచ్చినట్లు అందులో వివరించారు. సదరు కాపీ నకలును విచారణాధికారికి అందించారు. గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి అజయ్ కీర్తి గ్రామ పంచాయతీలో డిపాజిట్ చేసిన నగదు వివరాలు అందజేశారు. గ్రామ సర్పంచ్ గత పంచాయతీ కార్యదర్శి అజయ్ కీర్తిపై చేసిన ఆరోపణలు నిరాధారమైనవని విచారణ అధికారి అయిన ఆర్.పద్మకు పీఓపీఆర్డీ కె.రఘుబాబు తెలిపారు. విచారణ తదుపరి డివిజనల్ పంచాయతీ అధికారి ఆర్.పద్మ, పీఓపీఆర్డీ కే రఘుబాబు, పంచాయతీ కార్యదర్శితో కలిసి చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. సంపద కేంద్రం పంచాయతీ కార్యాలయం నుంచి దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉన్నందున ఆ రోడ్డు గుంతలు, కంకర రాళ్లతో నిండి ఉన్నందున తాము సేకరించిన చెత్తను కేంద్రం వద్దకు తీసుకెళ్లడం చాలా ఇబ్బందిగా ఉందని క్లాప్ మిత్రలు ఈ సందర్భంగా అధికారులకు తెలిపారు.



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

మరింత స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలి



ఆర్టీసీ గ్యారేజీలో ఉత్తమ ఉద్యోగులను అభినందిస్తున్న డిపో మేనేజర్

ఒంగోలు టౌన్: ఆదర్శ ఉద్యోగులుగా అవార్డు పొందిన ఆర్టీసీ ఉద్యోగులు మరింత స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు అన్నారు. అక్టోబరు నెలలో నిబద్ధతగా విధులు నిర్వర్తించి ఉత్తమ ఆదర్శ ఉద్యోగులుగా అవార్డు పొందిన కండక్టర్లు, డ్రైవర్లను శుక్రవారం ఒంగోలు ఆర్టీసీ గ్యారేజీలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ తమ అందరిదని, సంస్థ బలోపేతం కోసం సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతరం టార్గెట్ కంటే ఎక్కువ ఆదాయం తీసుకొచ్చిన కండక్టర్లు ఆర్ఎస్ ఇందిర, పి.హనుమంతరావు, కె.నాగరాజుకు అభినందనలు తెలిపారు. ఎక్కువ ఈపీకే తీసుకొచ్చిన డ్రైవర్లు వి.రమేష్, పి.బాలరాజు, కండక్టర్ తిరుపతమ్మ, ఎక్కువ డీజిల్ ఆదా చేసిన డ్రైవర్లు ఆర్ఎస్ బాబు, సీహెచ్ కృష్ణారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఆర్ఎం నాయక్, ఆర్టీసీ ఏఎస్ఐ కె.వెంకటరావు పాల్గొన్నారు.

12న ఏకేయూలో ఎన్ఎస్ఎస్ శిక్షణ

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని డిగ్రీ కళాశాలల్లో ఉన్న 60 ఎన్ఎస్ఎస్ యూనిట్ల ప్రోగ్రాం ఆఫీసర్లకి ఈ నెల 12వ తేదీ ఆంధ్రకేసరి యూనివర్సిటీలోని సమావేశపు హాలులో మై భారత్ పోర్టల్ అవేర్‌నెస్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఉపకులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి అధ్యక్షత వహిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, రీజినల్ కోఆర్డినేటర్ రామకృష్ణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, ప్రిన్సిపాల్ జి.రామ్మోహనరావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిర్మలామణి హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రోగ్రాం ఆఫీసర్లు తప్పకుండా హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలి

సంతనూతలపాడు: పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్ట, మంగమూరు గ్రామాల్లో రైతులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంతనూతలపాడు మండల వ్యవసాయాధికారిణి పి.పావని మాట్లాడుతూ రైతులు గత రెండు సంవత్సరాలుగా పొగాకు ధర ఎక్కువగా ఉండటంతో పొగాకు సాగుపై దృష్టి సారించారన్నారు. కానీ, ఈ ఏడాది పొగాకు సాగు తగ్గించేందుకు రైతులకు అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు చెప్పారు. అందువలన పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా శనగ, మినుము, జొన్న, అలసంద తదితర పంటలు సాగు చేయడం వలన పొగాకు పంటకు అయ్యే అధిక పెట్టుబడి, స్థిరంగా లేని మార్కెట్ ధరల వలన రైతులు నష్టపోకుండా ఉంటారని తెలిపారు. అలాగే పొగాకు వాడకం వలన అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. అనంతరం 50 శాతం రాయితీపై ట్రైకోడెర్మావిరిడీ జీవ శిలీంధ్రనాశిని పొడిమందును, 25 శాతం రాయితీతో శనగ విత్తనాలను రైతులకు అందజేశారు. రబీ 2024-25 సీజనుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరు రకాల పంటలకు బీమా కల్పించాయని తెలిపారు. జొన్న, శనగ, మినుము, ఎండు మిరప, మొక్కజొన్న పంటలకు రైతులు తమ వాటాగా బీమా ప్రీమియంను కామన్ సర్వీస్ సెంటర్లో గడువు తేదీ అయిన 2024 డిసెంబర్ 15లోగా చెల్లించాలని సూచించారు. వరి పంటకు మాత్రం 2024 డిసెంబర్ 31 వరకు గడువు ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కె.వి.సుబ్బారెడ్డి, పేర్నమిట్ట, మంగమూరు గ్రామాల వ్యవసాయ సహాయకులు జానకి, సౌజన్య, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారిణి పావని

లింగంగుంటలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి...

మద్దిపాడు: పొగాకు పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండలంలోని లింగంగుంట గ్రామంలో రైతులకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల వ్యవసాయాధికారి కె.రమేష్‌బాబు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉల్లాస్.. ఓ బృహత్తర కార్యక్రమం

మద్దిపాడు: ఉల్లాస్ ఓ బృహత్తర కార్యక్రమం అని ఎంపీడీవో జ్యోతి అన్నారు. మద్దిపాడులోని మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్లో ఏపీఎం సుబ్బారావు అధ్యక్షతన ఉల్లాస్ మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉల్లాస కార్యక్రమం ప్రాథమిక అక్షరాస్యత గురించే కాకుండా ఆర్థిక డిజిటల్ లీగల్ అక్షరాస్యత గురించి కూడా నేర్పుతుందన్నారు. ఇది డ్వాక్రా మహిళలకు మాత్రమే పరిమితం అని, ఉపయోగించుకోవాలని తెలిపారు. ఎంఈఓ ఆంజనేయులు మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం విజయవంతం అవడానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఏపీఎం సుబ్బారావు మాట్లాడుతూ తమ మండలంలో 658 మంది నిరక్షరాస్యులైన డ్వాక్రా మహిళలు ఉన్నారని, వారందరికీ ఉల్లాస కార్యక్రమం ఒక వరమని తెలిపారు. మండలంలోని కీర్తిపాడు, ఘడియాపూడి, వెల్లంపల్లి, గుండ్లపల్లి, పెద్దకొత్తపల్లి, దొడ్డవరం, సీతారాంపురం, ఇనమనమెల్లూరు, లింగంగుంట, రాచవారిపాలెం గ్రామాల్లో ఉల్లాస కార్యక్రమం అమలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వయోజన విద్య ఉపసంచాలకులు పాలకీర్తి వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి సురేఖ, డివిజనల్ పర్యవేక్షకులు టీ పోతురాజు, సీసీలు, ఆయా గ్రామాల మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వయోజన విద్య ఉపసంచాలకులు వెంకటేశ్వర్లు

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
1) EICHER 380DI 38HP 2022 MODEL AP39 UF 1487
2) NEW HOLLAND 3230S 45 HP 2023 MODEL AP40 AH 4188
3) ITL DI 74042 TRACTOR 2023 MODEL AP39 RV 7558
Cell : 91335 33003
D. No : 37-1-4, 2nd Floor, Vara Prasad Complex, Beside East KB Restarent, Trunk Road, ONGOLE.

రసాభాసగా సంతనూతలపాడు మండల సమావేశం

సంతనూతలపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో శుక్రవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. ఎంపీపీ బుడంగుంట విజయ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండలంలోని పలు గ్రామాల్లో పనుల నిర్వహణ, ఆమోదంపై చర్చ జరిగింది. సర్పంచుల అనుమతి లేకుండా పంచాయతీ కార్యదర్శులు సమావేశాలు పెట్టి తీర్మానాలు చేయడంపై పలువురు సర్పంచులు ధ్వజమెత్తారు. సర్పంచులు ఎం.రామానాయుడు, షేక్ పాత్యసాహెబ్, ఈ విజయలక్ష్మి, టి.వెంకటరెడ్డి, ఎస్.పుల్లయ్య, ఓ బలరామిరెడ్డి, మద్దులూరు ఎంపీటీసీ కే సుబ్బారావు, కో ఆప్షన్ సభ్యులు ఎస్కే రహంతుల్లా, వైస్ ఎంపీపీ మండవ సులోచన, టి.రాగమ్మ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా తీర్మానాలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. గ్రామాల్లో చేసే పనులను సర్పంచులు ఆమోదం లేకుండా ఎలా చేపడతారని ఆయా సర్పంచులు ధ్వజమెత్తారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నప్పటికీ చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని వ్యవసాయాధికారి దృష్టికి పలువురు తీసుకొచ్చారు. ఎరువుల దుకాణాల దగ్గర ధరల పట్టిక ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంతనూతలపాడు, తదితర గ్రామాల్లో తాగునీరు మురికిగా వస్తోందని, దీనిపై అధికారులు చర్యలు చేపట్టాలని సమావేశంలో పలువురు ధ్వజమెత్తారు. పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర శాఖల పనితీరుపై సమావేశంలో పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 9, 10 తేదీల్లో ఓటర్ల ప్రక్రియకు సంబంధించి ప్రత్యేక క్యాంపులు ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, వైస్ ఎంపీపీలు తన్నీరు రాగమ్మ, మండవ సులోచన, ఏఈలు వీరాంజనేయులు, శాంతి ప్రియ, వెంకట్ స్వామి, కృష్ణ, వైద్యులు, వెలుగు ఏపీఎం బాబూరావు, మండల వ్యవసాయ అధికారిని పి.పావని, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వాసంతి, ఎంపీటీసీలు, సర్పంచులు, పలు శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీలు, సర్పంచులు

మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్, ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ 2024కు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు యం.అంజల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణకు నవంబర్ 11వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నవంబర్ 14 నుంచి 2 నెలల పాటు ఉచిత శిక్షణ అందిస్తారన్నారు. ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఇస్తారని చెప్పారు. అభ్యర్థులకు బీఈడీలో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేస్తారన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటా తో పాటు పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీఈడీ, టీటీసీ మార్కు లిస్టు నకళ్లు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్ ఫొటోస్టాట్, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో నవంబర్ 11వ తేదీలోగా ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోని ఏపీబీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు. ఇతర పూర్తి వివరాలకు ఏపీబీసీస్టడీ సర్కిల్, ఒంగోలు, ప్రకాశం జిల్లా అనే చిరునామాలో కానీ, 08592-231232, లేదా 9989285530 అనే నంబర్లుపై సంప్రదించాలన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులపై ఎఫ్ఆర్ఎస్ అస్త్రం

- వేతనాల్లో కోత విధించిన అధికారులు
- అధికారుల తీరుపై మండిపడుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు



డీఎంహెచ్‌ఓకు వినతి పత్రం అందజేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘ నాయకులు

ఒంగోలు టౌన్: నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు సంబంధించి అక్టోబర్ నెల జీతాల్లో ముఖ ఆధారిత హాజరుకు అనుగుణంగా భారీ కోతలు విధించడం సరైందికాదని ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కోత విధించిన జీతాలను వెంటనే చెల్లించాలని కోరుతూ శుక్రవారం జిల్లా వైద్యాధికారి డా.సురేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వైద్యశాఖలో ఆప్కాస్, కాంట్రాక్టు ఉద్యోగులు, రెగ్యులర్ ఉద్యోగులు ఉండగా కేవలం నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల మీద మాత్రమే ఎఫ్ఆర్ఎస్ అస్త్రం ప్రయోగించడం కేవలం కక్షసాధింపు అని చెప్పారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా జీతాల్లో కోతలు విధించడం ఎంతమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఎఫ్ఆర్ఎస్ యాప్‌లోని లోపాలను సరిదిద్దేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎంహెచ్‌ఓను కలిసిన వారిలో జేఏసీ జనరల్ సెక్రటరీ ఏడుకొండలు, జిల్లా సభ్యులు విజయ భాస్కర్, కె.సురేంద్ర, సుబ్బలక్ష్మి తదితరులు వున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఒంగోలు డివిజన్
9010224456 90103 57744
90102 02762
చీమకుర్తి 84639 03727
Office mail : sakshiongads@gmail.com